సాక్షి
జనగామ
బుధవారం । 22 । మే । 2024



భక్తిభావం.. హనుమధ్యానం
వైశాఖమాసం హనుమాన్ దీక్షా సమయం కావడంతో దేవాలయాలన్నీ ఉదయం, సాయంత్రం మాలధారులతో సందడిగా మారుతున్నాయి. - 8లో▸



నవీన్ కన్నీటిధారలే 'అనురాగ దీపం'
అంపశయ్య నవీన్ కన్నీటిధారలే అనురాగ దీపం నవల ఇతివృత్తమని ప్రముఖ సాహితీవేత్త గంటా రామిరెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
39^0 /27^0

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉండి వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది

రైతుల్లో 'బోనస్' మంట

- ప్రభుత్వం దొడ్డురకం ధాన్యానికి బోనస్ ప్రకటించకపోవడంతో రైతుల ఆగ్రహం
- రెండు రకాలకు ఇవ్వాలని డిమాండ్
- జిల్లాలో సన్నరకం సాగు తక్కువే..



ధాన్యం రాశులు

జనగామ: అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే.. ధాన్యం క్వింటాల్‌కు రూ.5 వందల బోనస్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వగా.. కేబినెట్ మీటింగ్‌లో సన్నాలకే తీర్మానం చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యానికి బోనస్, పెట్టుబడి సాయం పెంపు, రూ.2లక్షల వ్యవసాయ రుణాలు మాఫీ తదితర హామీలు.. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం. గతేడాది డిసెంబర్ 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన వంద రోజుల్లో ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తామని రేవంత్‌రెడ్డి చెప్పిన విషయం తెలిసిందే. యాసంగి సీజన్ కోతలు, ధాన్యం అమ్మకాలు ముగియగా.. వానాకాలం నుంచి ధాన్యానికి బోనస్ వస్తుందని రైతులు ఆశపడ్డారు. రెండు రోజుల క్రితం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కేవలం సన్నరకం పండించిన రైతులకే బోనస్ ఇస్తామని చెప్పడంతో రైతాంగం తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. దీనిపై ప్రతిపక్ష పార్టీలు సైతం భగ్గుమంటున్నాయి. ఎలక్షన్ కోడ్ ముగిసిన వెంటనే ఆందోళన బాట పట్టే అవకాశం ఉంది. జిల్లాలో 4.50 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో ఏటా వానాకాలం (ఖరీఫ్)లో 3.30 లక్షలు, యాసంగి(రబీ)లో 2.40 లక్షల ఎకరాల వరకు అన్ని రకాల పంటలను సాగు చేస్తారు. వానాకాలంలో వరి 2.30 లక్షల ఎకరాలకు గాను సన్నాలు 60 శాతం (వ్యసాయ శాఖ అంచనా), యాసంగిలో 1.80 లక్షల ఎకరాలకు గాను 30 శాతం సన్నాలు (వ్యవసాయ శాఖ అంచనా) మేరకు సాగు అవుతుంది. వ్యవసాయ శాఖ అంచనాలు ఇలా ఉన్నప్పటికీ... క్షేత్రస్థాయిలో సన్నాల సాగు తక్కువే. అత్యధికంగా దొడ్డు రకం ధాన్యం సాగు చేసే రైతులు రూ.5వందల బోనస్‌కు దూరంగా ఉంటారు. సన్నరకాలు ఇంటి భోజనం కోసమే సాగు చేస్తున్న మెజార్టీ రైతులు.. వాటిని అమ్మకోరు. దీంతో బోనస్‌కు 90శాతం మంది రైతులు దూరంగా ఉంటే అవకాశం ఉంది.

ఐదేళ్లుగా జిల్లాలో రెండు సీజన్లలో వరి సాగు వివరాలు ఎకరాల్లో..

ఏడాది	యాసంగి(రబీ)	వానాకాలం(ఖరీఫ్)
2019-20	1,14,654	76,320
2020-21	1,59,828	1,49,383
2021-22	1,91,214	1,70,171
2022-23	1,92,736	2,13,358
2023-24	2,19,004	1,78,224 (ప్రస్తుతం)

గోదావరి జలాల రాకతో...

2014 తర్వాత ప్రత్యేక రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. గోదావరి జలాలు పరుగులు పెట్టాయి. చెరువులను నింపడంతో అడుగంటిన భూ గర్భజలాలు ఒక్కసారిగా పైపైకి చేరడంతో రికార్డు స్థాయిలో సాగు పెరిగింది. అప్పటి వరకు రెండు సీజన్లలో 1.50 లక్షలు దాటని సాగు... 5 లక్షల ఎకరాలకు చేరుకుంది. ఆ సమయంలో కూడా సాగుకాలం తక్కువ.. దిగుబడి ఎక్కువగా వచ్చే దొడ్డురకంపైనే రైతులు దృష్టి సారించారు. ప్రభుత్వ సెంటర్లలో కొనుగోలు చేసే క్వింటా ధాన్యానికి రూ.5 వందల బోనస్ ఇస్తామని ఎలక్షన్ సమయంలో ప్రకటించి సీఎం రేవంత్‌రెడ్డి...ఇప్పుడు సన్నరకానికి మాత్రమే వర్తిస్తుందని మాట మార్చడంతో.. రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సన్నాలకే బోనస్ ఇస్తామనడం సరికాదు



ప్రభుత్వం సన్న రకం వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం సరికాదు. దీంతో కొంతమంది రైతులకే మేలు జరుగుతుంది. దొడ్డురకం ధాన్యానికి సైతం బోనస్ ఇవ్వాలి. యాసంగి సీజన్ నుంచే బోనస్ ఇస్తామన్నా.. మాట మార్చి వానాకాలం అని. ఇప్పుడు సన్నాలకే ఇస్తామనడం సరికాదు.

- తోట రమేష్, రైతు, జఫర్‌గఢ్, వడ్డెగూడెం

మాట మార్చొద్దు



ప్రభుత్వం సన్నరకం ధాన్యం పండించిన వారికే బోనస్ అందిస్తామనడం బాధాకరం. దొడ్డు రకం పండించే తమ పరిస్థితి ఏంటి. తనకు 8 ఎకరాల సాగు భూమి ఉండగా, యాసంగిలో 6 ఎకరాల్లో దొడ్డు, 2 ఎకరాల్లో సన్నరకం సాగు చేయగా, ప్రస్తుత వానాకాలంలో సగం సగం సాగు చేస్తున్నా.

- దుంపల పద్మారెడ్డి, రైతు, తానేదార్‌పల్లి, స్టేషన్‌ఘన్‌పూర్

రెండు రకాలకు బోనస్ ఇవ్వాలి



సీఎం రేవంత్‌రెడ్డి ఎలక్షన్ సమయంలో ఇచ్చిన హామీ మేరకు, దొడ్డు, సన్నరకం ధాన్యాలకు బోనస్ ఇవ్వాలి. అధికారంలోకి వచ్చిన తర్వాత, మాట మార్చడం సరికాదు. బోనస్ విషయంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.

- ధరావత్ హేంసింగ్, రైతు, చెరువు ముందు తండా, కొడకండ్ల

కేయూ ఇన్‌చార్జ్ వీసీగా వాకాటి కరుణ

- నేడు బాధ్యతల స్వీకరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణను నియమించారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేష్ పదవీకాలం మంగళవారంతో ముగిసింది. కొత్త వీసీ నియామకానికి కొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో ఇన్‌చార్జ్ వీసీగా కరుణను నియమించారు. ప్రస్తుతం ఆమె మహిళా శిశు దివ్యాంగుల, సీనియర్ సిటిజన్ శాఖ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు జాయింట్ కలెక్టర్ మూడున్నరేళ్లు పనిచేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక 2015–2016లో వరంగల్ అర్బన్ కలెక్టర్‌గా పనిచేశారు.

భూముల అన్యాక్రాంతంపై అప్పట్లోనే దృష్టి

కలెక్టర్‌గా వాకాటి కరుణ ఉన్న సమయంలో కాకతీయ యూనివర్సిటీలో భూముల అన్యాక్రాంతంపై దృష్టి సారించారు. పలుచోట్ల వర్సిటీ భూములకు సంబంధించిన హద్దుల వద్ద బోర్డులు పెట్టించారు. ఇప్పుడు ఇన్‌చార్జ్ వీసీగా రానుండడంతో భూముల ఆక్రమణలకు సంబంధించిన వ్యవహారంపై మళ్లీ దృష్టి సారిస్తారా లేదా అనేది వేచి చూడాల్సిందే. కొంతకాలం క్రితమే ల్యాండ్ కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించి అందులో ఏముందో బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేడు బాధ్యతల స్వీకరణ?

కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా వాకాటి కరుణ బుధవారం బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం. వీసీ తాటికొండ రమేష్ పదవీకాలం ముగిసింది. ఆమెకు చార్జ్ అప్పగించాల్సింటుంది. ఇందుకు ఆయన హైదరాబాద్‌కు వెళ్తారా లేక చార్జ్ ఇచ్చినట్లుగా లెటర్‌పై సంతకం చేసి ఇస్తారా అనేది వేచి చూడాలి. ఒకవేళ చార్జ్ ఇచ్చే విధంగా లెటర్‌పై సంతకం రమేష్ చేసిస్తే రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి తీసుకెళ్లి ఆమెకు అందించనున్నారు. ఈ మేరకు మల్లారెడ్డి మంగళవారం రాత్రి వీసీ రమేష్‌తో మాట్లాడేందుకు వెళ్లినట్లు తెలిసింది.

మాజీ ప్రధానికి ఘన నివాళి



పాలకుర్తి టౌన్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నాయకులు

జనగామ: మాజీ ప్రధానమంత్రి, దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జనగామ జిల్లా కేంద్రం డీసీసీ కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కల్యాణి మల్లారెడ్డి, చెంచారపు బుచ్చిరెడ్డి, బనుక శివరాజ్, బడికె ఇందిర, జక్కుల అనిత, స్టాలిన్ తదితరులు ఉన్నారు.

ఆధునిక భారతావనికి పునాదులు వేసిన యోధుడు రాజీవ్‌గాంధీ

పాలకుర్తి టౌన్: ఆధునిక భారతావనికి పునాదులు వేసి అణగారిన బతుకుల్లో వెలుగులు నింపి ఆఖరి క్షణం కోసం ప్రజా సంక్షేమం కోసం బతికిన మహానేత రాజీవ్ గాంధీయేనని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం భారత రత్న రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, చిలువేరు కృష్ణమూర్తి, భూమ రంగయ్య, నీరటి చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



జనగామలో నివాళులర్పిస్తున్న నాయకులు

న్యూస్‌రీల్

పనులు వేగవంతంగా పూర్తి చేయండి



లింగాలఘణపురం: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని పటేల్‌గూడెంలో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గదుల్లో లైట్లు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, కిటికీలు, తలుపులు తదితర మరమ్మతు పనులను పరిశీలించారు. పాఠశాలలకు మంజూరైన నిధులను ఖర్చు చేసే విధంగా పనులు చేయాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి తదితరులు ఉన్నారు.

యూనిఫాం సకాలంలో అందజేయాలి



లింగాలఘణపురం: విద్యార్థులకు కుడుతున్న యూనిఫాంలను పాఠశాలలకు సకాలంలో అందజేయాలని డీఈఓ రాము కోరారు. మంగళవారం మండలంలోని గుమ్మడవెల్లిలో యూనిఫాం కుట్టు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలలు పునఃప్రారంభంలోగా అందజేయాలని కోరారు. అదేవిధంగా జీడికల్, గుమ్మడవెల్లి గ్రామాల్లో అమ్మ ఆదర్శ కమిటీలతో చేపట్టిన పాఠశాలల మరమ్మతు పనులను పరిశీలించారు. ఆయనతో పాటు నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి తదితరులు ఉన్నారు.

నిబద్ధత కలిగిన వ్యక్తి ప్రేమేందర్‌రెడ్డి



జనగామ: నాలుగు దశాబ్దాల సుదీర్ఘ కాలం పాటు రాజకీయ జీవితంలో ప్రజల కోసం పని చేస్తున్న గుజ్జుల ప్రేమేందరరెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. నెల్లుట్ల బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం జిల్లా అధ్యక్షుడు ఆ రుట్ల దశమంతరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ సమయం దగ్గర పడుతుండండతో మిగిలిన ఆరు రోజుల పాటు పార్టీ శ్రేణులు ఓటర్ల వద్దకు వెళ్లి, ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా విజ్ఞప్తి చేయాలన్నారు. ఓటువేసే సమయంలో ఆలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్: కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత విద్యకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమాధికారి బి. రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతిపాదించిన కార్పొరేట్ కళాశాలల్లో రెండేళ్ల పాటు ఉచిత విద్యా పొందుటకు పదో తరగతి ఉత్తీర్ణత పొందాలన్నారు. పదవ తరగతిలో జీపీఏలో 7 అపైన సాధించిన పేద విద్యార్థులు అర్హులని బీసీ, ఈబీసీ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉండాలని తెలిపారు. ఈనెల 30లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

25 నుంచి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

జనగామ రూరల్: ఈనెల 25 తేదీన ధర్మకంచ మినీ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోషియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో 8, 10, 12, 14, 16, 18, 20 మెన్ ఉమెన్ వారికి అథ్లెటిక్స్‌లో పోటీలు ఉంటాయన్నారు. లాంగ్ జంప్, షాట్‌పుట్, హామర్ త్రో, డిస్కస్ త్రో వంటి పోటీలు వివిధ కేటగిరిలో ఉంటాయని, ఇందులో ఎంపికైన క్రీడాకారులు జూన్ 6, 7వ తేదీల్లో హనుమకొండలోని నెహ్రూ స్టేడియంలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 25 తేదీన జనన ధ్రువీకరణ పత్రాలతో తప్పనిసరిగా పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 9885046437, 9912453220 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పూటకో మాట

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: కాంగ్రెస్ ప్రభుత్వం పూటకో మాట మాట్లాడుతుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చేందుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చారని, ఇటీవల నిర్వహించిన మంత్రి వర్గ సమావేశంలో రైతులకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవడం సిగ్గు చేటన్నారు. అధికారంలోకి రాగానే ధాన్యం క్వింటాల్‌కు రూ.5 వందల బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పుడు మాటమార్చి సన్నరకం వడ్లకే వర్తిస్తుందనడం సరికాదన్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 56 కేసులతో 72 రోజుల పాటు జైలులో ఉన్న తీన్మార్ మల్లన్న కావాలా.. స్వచ్ఛమైన రాజకీయాలు చేస్తున్న రాకేష్‌రెడ్డి గెలువాలో ఆలోచన చేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున లింగయ్య, నాయకులు ఇర్రి రమణారెడ్డి, గాడిపెల్లి ప్రేమలతరెడ్డి, సిద్ధిలింగం, గద్దల నర్సింగరావు, భైరగోని యాదగిరి, గుర్రం నాగరాజు, పసుల ఏబేలు, దేవరాయ నాగరాజు, ఉల్లెంగుల సందీప్, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

- వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న గోపి

పాలకుర్తి: ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి అన్నారు. మంగళవారం పాలకుర్తి మండలం ఎల్లరాయని తొర్రూరు గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రిజ్వాన బాషాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతం, కొనుగోళ్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లలో రైతులకు డబ్బులు జమను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలులో వెంటనే ఓపీఎంఎస్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామంలోని విత్తన డీలర్లను అధికారులు నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఈ సందర్భంగా సొసైటీలో 210 మంది దగ్గర కొనుగోలు చేసి తరలించగా 187 మంది రైతులకు డబ్బులు జమ అయినట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ శాఖ డీఏఓ వినోద్, జిల్లా డీసీఓ రాజేందర్ రెడ్డి, డీసీఎస్ఓ రోజా రాణి, సివిల్ సప్లయీస్ డీఎం ప్రసాద్, ఆర్‌డీఓ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశం, సర్కిల్ డీటీ దేవా, ఏడీఓ పరశరాములు, కార్యదర్శి రణధీర్, ఏఈఓ సంధ్య, వెంకటేశం, రాజేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌పై మరింత నమ్మకం పెంచండి



సమావేశంలో పాల్గొన్న హరీశ్‌రాజు, మధుసూదన్‌రెడ్డి

జనగామ: జనగామ చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రంపై మరింత నమ్మకం కలిగించేలా వైద్యులు, సిబ్బంది పని చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ హరీశ్‌రాజు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం వైద్యారోగ్యశాఖ, ఎంసీహెచ్ ఆధ్వర్యంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఎంసీహెచ్‌లో ఆపరేషన్ల సంఖ్య తగ్గించాలన్నారు. ప్రభుత్వ డెలివరీల సంఖ్యను పెంచుతూ ప్రైవేట్‌కు వెళ్లే వారిని తగ్గించే విధంగా ప్రయత్నం చేయాలన్నారు. ఎస్ఎన్‌సీయూ, చిన్న పిల్లలు, ఎన్‌సీడీ క్లినిక్ తదితర సేవలను పరిశీలించారు. జిల్లాలోని నాలుగు సీహెచ్‌సీ సెంటర్లలో 3, 4వ ఏఎన్‌సీ చెకప్‌ల కోసం ఏర్పాట్లు చేసి, ఎంసీహెచ్‌పై భారం తగ్గించాలన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మహేందర్, వైద్యులు రమాదేవి, భాస్కర్, అశోక్ కుమార్, కర్ణాకర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన దేవాదుల ఫేజ్3 పనులు

- పూర్తి కాని కాల్వ నిర్మాణం
- ఏళ్లు గడుస్తున్నా..నెరవేరని రైతుల కల



మగ్దుంతండా మీదుగా సీసీ నిర్మాణంతో చేపట్టిన దేవాదుల కాల్వ



అసంపూర్తిగా దేవాదుల కాల్వ నిర్మాణం

జఫర్‌గఢ్: దేవాదుల ఫేజ్ 3 పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఉప్పుగల్లు రిజర్వాయర్ పూర్తై రెండేళ్లవుతున్న సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. భూ సేకరణ, భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపు పెండింగ్‌లో ఉండడంతో కాల్వల తవ్వకం పనులు పూర్తి కావడం లేదు. దీంతో ఏళ్లు గడుస్తున్న పంటలకు సాగునీరు అందక రైతుల కలలు కలగానే మిగిలిపోతున్నాయి. దేవాదుల మూడో దశ ప్రాజెక్టు ద్వారా ప్యాకేజీ 6 కింద మూడు రిజర్వాయర్ల ద్వారా 77,890 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించేందుకు ఈ నిర్మాణం చేపట్టారు. ఇందుకు అప్పటి ప్రభుత్వం రూ.393 కోట్ల వ్యయంతో దేవాదుల ఫేస్ 3 పనులు చేపట్టారు. దీంతో కొత్తగా ఏర్పడిన 5 జిల్లాలు కలుపుకొని స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, వర్ధన్నపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు చెందిన 10 మండలాలైన జఫర్‌గఢ్, పాలకుర్తి, వర్ధన్నపేట, కొడకండ్ల, రాయపర్తి, ఐనవోలు, తిరుమలగిరి, నాగరం సంబంధించిన ఆయా చెరువులు, కుంటల ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించాల్సి ఉంది. 2010 సంవత్సరంలోనే అప్పటి ప్రభుత్వం రూ.325 కోట్లను మంజూరు చేసినప్పటికీ పనులకు మాత్రం 2016 సంవత్సరం జూలై 27న అప్పటి రాష్ట్ర గిరిజన అభివృద్ధి, పర్యాటక శాఖ మంత్రిగా పని చేసిన అజ్మీరా చందూలాల్, ఎమ్మెల్యేలు డాక్టర్ తాటికొండ రాజయ్య, అరూరి రమేశ్ చేతుల మీదుగా ఉప్పుగల్లు గ్రామంలో శంకుస్థాపన చేశారు. పనులు 2020 కల్లా పూర్తి చేయాల్సి ఉండగా సదరు కాంట్రాక్టర్ ప్రారంభంలో కొంత మేర పనులు చేసి ఆ తర్వాత పనుల నిర్మాణంలో జాప్యం చేయడంతో ఆ కాంట్రాక్ట్ పనులను ప్రభుత్వం రద్దు చేసింది. రీ టెండర్ ద్వారా మళ్లీ పనులు చేపట్టి 0.35 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం గల ఉప్పుగల్లు రిజర్వాయర్ నిర్మించి, నీటిని కూడా నిల్వ చేశారు.

నిర్మాణ దశలోనే పాలకుర్తి రిజర్వాయర్ పనులు..

పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లు పూర్తి చేయాల్సి ఉండగా ఇందులో చెన్నూరు రిజర్వాయర్ పనులు దాదాపుగా పూర్తి కావస్తున్న పాలకుర్తి రిజర్వాయర్ మాత్రం ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. ఉప్పుగల్లు రిజర్వాయర్ కింద 45,210 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అయితే ప్రధాన కాల్వకు సంబంధించిన నిర్మాణ పనులు 21 కిలోమీటర్లు పూర్తి చేయాల్సి ఉండగా కేవలం 19 కిలోమీటర్ల మేర కాల్వ మట్టి తవ్వకం పనులు మాత్రమే పూర్తి చేశారు. అక్కడక్కడ ప్రధాన కాల్వల నిర్మాణంతో పాటు ఉప కాల్వలకు సంబంధించిన పనులు చేపట్టాల్సి ఉండటంతో దీనికి సంబంధించిన భూసేకరణ పనులు పెండింగ్‌లో ఉంది. పైగా భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపులు జరగకపోవడంతో రైతుల నుంచి ఆటంకాలు ఎదురౌతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికైన నూతన ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి కాల్వల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి పంట పొలాలకు సాగునీరు అందించి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

భూసేకరణ, రైతుల పరిహారం పెండింగ్‌లో ఉంది..

ఉప్పుగల్లు రిజర్వాయర్ పూర్తి చేసి రెండేళ్లవడంతో పాటు దీనికి సంబంధించిన ప్రధాన కాల్వ నిర్మాణ పనులు 19 కిలోమీటర్ల వరకు పూర్తి చేశాం. ఇంకా ఉప కాల్వలతో పాటు ప్రధాన కాల్వకు సంబంధించిన కొంత భూ సేకరణ, రైతులకు పరిహారం పెండింగ్‌లో ఉంది. దీంతో కాల్వల నిర్మాణ పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి.

- జే. రవీందర్, డిప్యూటీ ఇంజనీర్, దేవాదుల ప్రాజెక్టు

రేడియాలజీ హబ్‌కు వెళ్లేదెలా?



రేడియాలజీ హబ్‌కు వెళ్తున్న వ్యక్తి

జిల్లా కేంద్రం మున్సిపల్ కార్యాలయం ఏరియాలో ఏర్పాటు చేసిన రేడియాలజీ హబ్ (అల్ట్రా సౌండ్, ఎక్స్‌రే, స్కానింగ్)కు వచ్చే పేషెంట్లకు ఇబ్బంది తప్పడం లేదు. హబ్ ముందు భాగంగా మెట్ల దారి లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఒంటరిగా వచ్చే వృద్ధులు డ్రెయినేజీ దాటుకుంటూ.. కింద పడిపోతూ గాయాల పాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, రేడియాలజీ హబ్‌కు మెట్ల నిర్మాణంతో రోప్ సైతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

-జనగామ

'రిజిస్ట్రేషన్'పై న్యాయం చేయాలని నిరసన



పురుగు మందు డబ్బాతో రాజ్‌కుమార్

చిల్పూరు: తన భార్య పేరు మీదున్న భూమిని తనకు తెలియకుండా ఇతరులకు అక్రమంగా పట్టా చేశారని, ఆ పట్టాను రద్దు చేయాలని, లేనిపక్షంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడుతానని మండల కేంద్రానికి చెందిన బొల్ల రాజ్‌కుమార్ మంగళవారం తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజ్‌కుమార్‌కు తన భార్య స్వప్నతో ఇటీవల కుటుంబ తగాదాలు ఏర్పడ్డాయి. దీంతో స్వప్న పుట్టింటికి వెళ్లి పోయింది. స్వప్న పేర ఎకరం 24 గుంటల వ్యవసాయ పట్టా భూమి ఉంది. ఆ భూమి మీద బ్యాంకులో అప్పు ఉంది. ఇక భర్తతో తనకు సంబంధం లేదని స్వప్న భూమిని అమ్మకానికి పెట్టింది. కొనుగోలుదారుడు అఫిడవిట్ పత్రాలు తహసీల్దార్ సరస్వతికి సమర్పించి కొనుగోలు చేశాడు. విషయం తెలుసుకున్న రాజ్‌కుమార్ తనకు తెలియకుండా భూమిని మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారంటూ ఆర్డీఓ, తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రాలు సమర్పించాడు. అయినా వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో మంగళవారం పురుగు మందుడబ్బాతో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగాడు. విషయం తెలుసుకున్న ఎస్సై రాజేందర్ ఘటనాస్థలికి చేరుకుని న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఇదే విషయమై తహసీల్దార్ సరస్వతి మాట్లాడుతూ రాజ్‌కుమార్, ఆయన భార్యకు మధ్య గొడవలు ఉన్న విషయం తెలియదని, కొనుగోలుదారుడు అఫిడవిట్ దాఖలు చేసిన నేపథ్యంలో పట్టా చేశామని, రెండు రోజుల్లో రద్దు చేస్తానని తెలిపారు.

క్లుప్తంగా

సీఈఐఆర్‌తో ఫోన్ రికవరీ సులభం

పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



వరంగల్ క్రైం : సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే పోయిన సెల్‌ఫోన్‌ను తిరిగి పొందే అవకాశం ఉందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో పోగొట్టుకున్న వారి సెల్‌ఫోన్లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు 142 సెల్‌ఫోన్లను వాటి యజమానులకు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సీఈఐఆర్ వెబ్‌సైట్ ఎంతో ఉపయోగకరంగా ఉందని, ఎవరైతే మొబైల్ పోగొట్టుకున్నారో వారు మొదట అదే నంబర్‌తో కొత్త సిమ్ తీసుకొని, మీ సేవలో మొబైల్ లాస్ట్ అప్లికేషన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం www.ceir.gov.in లో రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్/స్టోలెన్ మొబైల్ లింక్‌ను క్లిక్ చేయాలి. పోయిన సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్, కంపెనీ పేరు, మోడల్, కొనుగోలు చేసిన రశీదు, మీ సేవ దరఖాస్తు రశీదు నంబర్‌ను అప్‌లోడ్ చేయాలన్నారు. మొబైల్ ఏ రోజు, ఎక్కడ పోయింది, రాష్ట్రం, జిల్లా, పోలీస్ స్టేషన్ వివరాలు, చివరగా వినియోగదారుడి పేరు, చిరునామా, గుర్తింపుకార్డు, ఈ మెయిల్ ఐడీ వివరాలు నమోదు చేయాల న్నారు. అనంతరం పోయిన మొబైల్ బ్లాక్ అవుతుందని, ఇదంతా పూర్తయిన తర్వాత తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని పేర్కొన్నారు. పోగొట్టుకున్న తమ సెల్‌ఫోన్లను తిరిగి అందజేసినందుకు యజమానులు సీపీకి కృతజ్ఞతలు తెలిపారు. సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్‌రాజ్, ఐటీ కోర్ విభాగం హెడ్ కానిస్టేబుల్ మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య



యాదగిరి(ఫైల్)

కాశిబుగ్గ: రైలు కింద పడి ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వరంగల్, చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం ఏనుమాముల ఎస్టీఆర్ నగర్‌కు చెందిన గుండా యాదగిరి(62) ఆర్టీసీలో డ్రైవర్‌గా పని చేస్తూ రెండు సంవత్సరాల క్రితం రిటైర్డ్ అయ్యాడు. రెండు నెలల క్రితం తన చిన్న కుమారుడు రామకృష్ణకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో తన వద్ద ఉన్న రూ. 8 లక్షలతో ఆపరేషన్ చేయించాడు. దీంతో యాదగిరి వద్ద డబ్బు అయిపోయింది. కాశిబుగ్గ జంక్షన్‌లో పెద్ద కుమారుడు కృష్ణతో కలిసి పాన్ షాపులో పనిచేస్తున్నాడు. తన వద్ద డబ్బు అయిపోయిందని, రిటైర్డ్ అయినా రోజూ పని చేయాల్సి వస్తోందని బాధపడేవాడు. ఈక్రమంలో మంగళవారం బయటకు వెళ్తున్నానని పెద్ద కుమారుడు కృష్ణకు చెప్పాడు. షాపు నుంచి బైక్‌పై లేబర్‌కాలనీలో ఉంటున్న మేనల్లుడి వద్దకు వెళ్లాడు. అక్కడ బైక్ పార్క్ చేసి జాన్‌పీరీలు గేట్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి రాజు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పెద్ద కుమారుడు కృష్ణకు అప్పగించామని జీఆర్పీ సీఐ తెలిపారు.

అందరూ ఒకే కుటీరంలో ఉండడం.. స్వయంపాకం చేసుకోవడం.. రోజుకొకరు తమ ఇండ్లలో పూజలు.. ఆలయాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో అభిషేకాలు, భజనలు, కీర్తనలు.. ఇవి ప్రస్తుతం గ్రామాల్లో కనిపిస్తున్న ఆధ్యాత్మిక పరిమళాలు. వైశాఖమాసం హనుమాన్ దీక్షా సమయం కావడంతో దేవాలయన్నీ ఉదయం, సాయంత్రం మాలధారులతో సందడిగా మారుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భక్తులు పెద్ద ఎత్తున హనుమాన్ మాలధరిస్తున్నారు. ఫలితంగా జై హనుమాన్..జై శ్రీరాం నామసంకీర్తనలతో పల్లెలు, పట్టణాలు మార్మోగుతున్నాయి.

- గూడూరు/గోవిందరావుపేట

గూడూరు: దీక్ష ముగించుకుని కొండగట్టుకు బయలుదేరిన హనుమాన్ మాలధారులు (ఫైల్)



భక్తిభావం.. హనుమధ్యానం..

జై హనుమాన్, జై శ్రీరాం నామసంకీర్తనలతో మార్మోగుతున్న గ్రామాలు

- కొనసాగుతున్న హనుమాన్ మాలధారుల దీక్షలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ద ఎత్తున స్వీకరిస్తున్న భక్తులు
- జూన్ 1న హనుమాన్ జయంతితో ముగింపు

పలు ఆలయాల సందర్శన..

చిన్న హనుమాన్ జయంతికి ముందు నుంచే మాలధారులు పలు ఆలయాలు సందర్శిస్తున్నారు. కొందరు హనుమాన్, ఇతర దేవాలయాల్లో దీక్షా కాలం గడుపుతున్నారు. కొందరు తమ పిల్లలకు కూడా హనుమాన్ మాల ధరింపజేసి ఆధ్యాత్మిక చింతన అలవరుస్తున్నారు. దీక్ష పాటిస్తూ వృత్తి ధర్మం నెరవేరుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పెద్ద హనుమాన్ జయంతి జూన్ 1వ తేదీన కావడంతో మండల కాలం (41) రోజులు మాలధారణ పూర్తయిన మాలధారులు ఇరుముడి కట్టుకుని కరీంనగర్ జిల్లా కొండగట్టు, ఇతర హనుమాన్, ఇతర పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. మొదటిసారి మాలధారులు ఎక్కువ కొండగట్టు దర్శించుకుంటారు. కాగా, చివరి మూడు రోజులు మాలధారులు ఆయా గ్రామాల్లోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో రామనామం, చాలీసా పారాయణం, నగర సంకీర్తన శోభయాత్ర (దేవుడి ఊరేగింపు) చేసి హనుమాన్ జయంతి రోజు మహా అన్నదానం చేపడుతారు. అనంతరం భద్రాచలం, ఇతర ఆలయాలకు వెళ్లి మాల విరమణ చేయడంతో దీక్ష పూర్తవుతుంది.



గోవిందరావుపేట: ఆంజనేయ స్వామి విగ్రహానికి చందనం వేస్తున్న హనుమాన్ మాలధారులు

30 సంవత్సరాల నుంచి మాలధారణ

గోవిందరావుపేట మండలం చల్వాయిలో 30 సంవత్సరాల నుంచి 150 నుంచి 200 మంది హనుమాన్ మాలధరిస్తున్నారు. కరోనా సమయంలో కూడా అధికారుల అనుమతి తీసుకుని కొందరు హనుమాన్ మాలధారణ చేపట్టారంటే గ్రామంలో భక్తి భావం ఎంత ఉందో ఊహించుకోవచ్చు. కులం, గోత్రం, చిన్న, పెద్ద అని తేడా లేకుండా హనుమాన్ మాలధారణ చేసి అందరూ భక్తిశ్రద్ధలతో దీక్ష చేపడుతారు. దివంగత ఏనుగుల విష్ణువర్ధన్ గురుస్వామితోనే ఈ ఐకమత్యం ఇప్పటికీ కొనసాగుతుందని భక్తుల నమ్మకం. గురుస్వామి విష్ణు కొంత కాలం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడి వారసత్వాన్ని మూల కుమార స్వామి కొనసాగిస్తున్నారు.

మొదటిసారి మాలధరించా



మొదటిసారి హనుమాన్ మాలధరించిన వారిని కన్నెస్వామి అంటారు. అంజనేయస్వామిని ఆరాధిస్తే బుద్ధి, బలం సిద్ధిస్తాయని నమ్మి మాలధరించా. దీక్షా కాలం ఆనందంగా ఉంది. శారీరక, మానసిక ప్రశాంతత కలుగుతుంది.

- వడ్లకొండ బాలకృష్ణ, కన్నెస్వామి, గూడూరు

23 సంవత్సరాలుగా మాలధరిస్తున్నా



23 సంవత్సరాలుగా హనుమాన్ మాలధరిస్తున్నా. వృత్తిపరంగా గీత కార్మికుడిని. రోజు పూజలు ముగిసిన అనంతరం వృత్తి కొనసాగిస్తా. మండలంలో ఎక్కువ సార్లు మాలవేసుకుంది నేనే. 20 మంది మాలధారులతో కుటీరం ఏర్పాటు చేసుకుని పూజలు చేస్తాం. దీక్షతో ఆరోగ్యం, ఆనందం, ఆహ్లాదం కలుగుతున్నాయి.

- మేరుగు మల్లయ్యగౌడ్, గురుస్వామి, గూడూరు

దీక్షలో ఉన్నంత కాలం అద్భుతంగా ఉంటుంది



గ్రామంలో 30 సంవత్సరాల నుంచి హనుమాన్ మాలధారణ జరుగుతోంది. ఏటా 150 నుంచి 200 మంది వరకు మాలధారణ చేస్తుంటారు. అందరూ ఒకే దగ్గర ఉండి క్రమశిక్షణ, నిష్ఠతో దీక్ష చేపడుతారు. ఈ సమయంలో హనుమాన్ దేవుడే మీద కుర్చున్నాడా అని అనిపిస్తుంది. అద్భుతంగా గడుస్తుంది.

- మూల కుమారస్వామి, గురుస్వామి, చల్వాయి, గోవిందరావుపేట

వీసీ లాడ్జ్ నుంచి ఫైళ్లు మాయం

- కేయూ రిజిస్ట్రార్‌తో అకుట్ బాధ్యుల వాగ్వాదం



రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదం చేస్తున్న అకుట్ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వీసీ లాడ్జ్ నుంచి ఫైళ్లు మాయమయ్యాయని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం(అకుట్) జనరల్‌సెక్రటరీ మామిడాల ఇస్తారి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం సంఘం బాధ్యులతో కలిసి రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీసీ రమేశ్‌పై ప్రభుత్వం ఇటీవల విజిలెన్స్ విచారణకు ఆదేశించిందన్నారు. ఈ నేపథ్యంలో వీసీ మూడు రోజుల నుంచి యూనివర్సిటీకి రావడం లేదన్నారు. అయితే ఈనెల 20న వీసీ లాడ్జ్‌నుంచి పలు ఫైళ్లు బయటకు తీసుకెళ్లారని ఆరోపించారు. ఈ అంశంలో సీసీ ఫుటేజీ పరిశీలించాలని డిమాండ్‌చేస్తూ రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగారు. వీసీ లాడ్జ్ నుంచి తరలించిన ఫైళ్లలో పలు మార్పులు చేసే అవకాశం ఉంటుందన్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్లకు సంబంధించిన పార్ట్‌టైం, ఫుల్‌టైం అడ్మిషన్లకు సంబంధించి ఫైళ్లు, విద్యార్థులకు వచ్చిన మార్కులు లిస్టు, కంప్యూటర్ కొనుగోళ్లకు సంబంధించిన అప్రూవల్ ఆర్డర్లను మార్చేఅవకాశం ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అకుట్ అధ్యక్షుడు ప్రొఫెసర్ తౌటం శ్రీనివాస్, డాక్టర్ బ్రహ్మేశ్వరి, డాక్టర్ ఎం శ్రీనివాస్, కిశోర్‌కుమార్, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేయూ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు ఇస్తారి తెలిపారు.

సీసీ ఫుటేజీ పరిశీలిస్తాం

వీసీ లాడ్జ్ నుంచి ఫైళ్లు మాయమయ్యాయనే ఆరోపణలపై రిజిస్ట్రార్ మల్లారెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా లాడ్జ్‌లో ముఖ్యమైన ఫైళ్లు ఏమిలేవన్నారు. రొటీన్‌కు సంబంధించిన పలు ఫైళ్లు ఉండొచ్చునని, అవి తీసుకెళ్లే అవకాశం ఉందని తెలిపారు. వీసీ లాడ్జ్ వద్ద సీసీ ఫుటేజీ పరిశీలిస్తామని వివరణ ఇచ్చారు.

నవీన్ కన్నీటిధారలే 'అనురాగ దీపం'



నవలను ఆవిష్కరిస్తున్న గంట రామిరెడ్డి, అంపశయ్య నవీన్ తదితరులు

- ప్రముఖ సాహితీవేత్త గంట రామిరెడ్డి

విద్యారణ్యపురి: అంపశయ్య నవీన్ కన్నీటిధారలే అనురాగ దీపం నవల ఇతివృత్తమని ప్రముఖ సాహితీవేత్త గంట రామిరెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని పాపడమ్స్ బ్లూ బాంక్వెట్‌హాల్‌లో నవీన్ లిటరరీ ట్రస్టు ఆధ్వర్యంలో అంపశయ్యనవీన్ సతీమణి అనసూయ ప్రథమ వర్ధంతి నిర్వహించారు. అలాగే, అంపశయ్యనవీన్ తన సతీమణి అనసూయతో ఆరవై ఏళ్ల దాంపత్యజీవితంపై రచించిన 'అనురాగ దీపం' నవల ఆవిష్కరణ కార్యక్రమంలో రామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నవీన్.. అనసూయతో తనకున్న గాఢమైన స్నేహబంధం, ప్రేమను ఉద్విగ్నభరితంగా ఈ నవలలో రాశారని కొనియాడారు. అనంతరం ప్రముఖ రచయిత నెల్లట్ల రమాదేవి గ్రంథాన్ని సమీక్షిస్తూ.. నవీన్ తన అంతరంగాన్ని ఈ నవలలో అద్భుతంతంగా ఆవిష్కరించారని తెలిపారు. 60 ఏళ్ల దాంపత్యజీవితంలో తనను కంటికి రెప్పలా కాపాడుకున్న అనసూయ ఎడబాటును తట్టుకోలేని నవీన్ తన కన్నీళ్లను తన కలంలో ఇంకుగా రంగరించి రాసిన నవలే అనురాగదీపం అని తెలిపారు. ఈ నవల భార్యాభర్తల అన్యోన్య దాంపత్యానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈసభకు సాహితీవేత్త గన్నమనేని గిరిజామనోహరబాబు అధ్యక్షత వహించారు. ట్రస్టు కార్యదర్శి డి స్వప్న అమ్మంగివేణుగోపాల్, కె వరలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యనవీన్, కవులు, సాహితీవేత్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగ అరెస్ట్

- రూ.2.15 లక్షల విలువైన బైక్ స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రామన్నపేట : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో బైక్‌ల అపహరణకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి రూ.2.15 లక్షల విలువైన బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ టి.గోపి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా సంగడిగుంటకు చెందిన చాగంటి పవన్ తిరుమలేష్ కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు 30 మందిని నమ్మించాడు. వారి కొత్త బైక్‌లు చూసి తాను కూడా అలాంటి వాహనమే కొంటున్నానని చెప్పి ట్రయల్ చేస్తానని వాహనాల అపహరణకు పాల్పడి పలుమార్లు జైలుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఈనెల 9వ తేదీన ములుగు రోడ్డులోని ఇండస్ట్రియల్ ఏరియా వద్ద కామెర అరవింద్ అనే వ్యక్తి బైక్‌ను ట్రయల్ చేస్తానని చెప్పి అపహరించాడు. ఈ విషయంపై బాధితుడి ఫిర్యాదు మేరకు మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఎస్సైలు, క్రైమ్ టీమ్ కలిసి సదరు దొంగను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి బైక్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి

- విత్తన డీలర్ కేంద్రాలను రోజూ పర్యవేక్షించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి



వీసీలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి

జనగామ రూరల్: క్షేత్రస్థాయిలో రైతులకు విత్తనాలపై అవగాహన కల్పించి రోజూ అధికారులు విత్తన డీలర్ కేంద్రాలను పర్యవేక్షించాలని, ఎరువుల కొరత లేకుండా చూసి రైతులకు సూచనలు చేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి అన్నారు. మంగళవారం జనగామ జిల్లా గానుగుపహాడ్ గ్రామ రైతువేదికలో 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో కలిసి రాష్ట్రంలో ఉన్న 33జిల్లాల వ్యవసాయ అధికారులతో వానాకాల పంటలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం పంటలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, గ్రామాల్లో ఎప్పటికప్పుడు విత్తనాలు, ఎరువుల కేంద్రాలను అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులు విడి విత్తనాలు కొనుగోలు చేయరాదని, ప్యాకింగ్ చేసినవి కోనుగోలు చేయాలన్నారు. విత్తనాల ఎంపికపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు రైతు వేదికల్లో పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. విత్తన కొనుగోలు చేసిన ప్యాకెట్లను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలన్నారు. ఎరువుల డీలర్లు తప్పనిసరిగా మూడు రకాల రిజిస్టర్లు నిర్వహించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు రోజూ ఆ రిజిస్టర్లు తనిఖీ చేసి నివేదికలు ఇవ్వాలన్నారు. అనంతరం రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఏఓ వినోద్‌కుమార్, డీసీఎస్ఓ రోజారాణి, డీఎంసీఎస్ ప్రసాద్, ఏడీఏ బీనా, ఏవో కర్నాకర్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరి మృతి




విజయ్(ఫైల్)



ఆదాం(ఫైల్)

వరంగల్: ఏనుమాముల 14వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలోని ముసలమ్మకుంటలో ఈతకు వెళ్లిన ఇద్దరు నీటి మునిగి మృతి చెందారు. ఏనుమాముల సీఐ పులి రమేశ్ కథనం ప్రకారం.. దేశాయిపేటలో పెయింటర్లుగా జీవనం కొనసాగిస్తున్న జన్ను యేసు అలియాస్ విజయ్(40), జన్ను ఆదాం(36) మంగళవారం ఈత కొట్టేందుకు ముసలమ్మకుంటలోకి వెళ్లారు. ఈత కొడుతూ నీటిలో మునిగిపోవడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అదేరోజు మధ్యాహ్నం వరకు మృతదేహాలు పైకి తేలడంతో స్వాధీనం చేసుకుని ఎంజీఎం మార్చురీకి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ రమేశ్ తెలిపారు. కాగా, విజయ్, ఆదాం.. వారం రోజుల నుంచి క్రమం తప్పకుండా ముసలమ్మకుంటలో ఈత కొడుతున్నట్లు స్థానికులు తెలిపారు.

బయ్యారంలో వాలీబాల్ క్రీడాకారుడు..



గౌతమ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

బయ్యారం: ఈతకు వెళ్లిన ఓ వాలీబాల్ క్రీడాకారుడు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం బయ్యారంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన జినక లక్ష్మీనారాయణ కుమారుడు గౌతమ్(14) మహబూబాబాద్‌లోని జ్యోతిబాపూలే గురుకులంలో 8వ తరగతి పూర్తి చేశాడు. చదువుతో పాటు వాలీబాల్ క్రీడలో ప్రతిభ కనబర్చడంతో జూన్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యాడు. ఈ క్రమంలో వేసవి సెలవులు కావడంతో వరుసకు సోదరుడయ్యే గణేశ్‌తో కలిసి సమీపంలో ఉన్న దామెరచెరువు వద్దకు ఈతకు వెళ్లాడు. ఈత కొడుతున్న సమయంలో గౌతమ్ నీటిలో మునగడంతో గణేశ్ భయంతో ఇంటికి వచ్చి బంధువులకు చెప్పాడు. వారు వెళ్లే సమయానికి గౌతమ్ మృతి చెందాడు. తల్లిదండ్రులు గుండలవిసేలా రోదించారు. కాగా, క్రీడల్లో రాణిస్తున్న గౌతమ్ చిన్న వయసులోనే మృతి చెందడం కుటుంబసభ్యులతో పాటు స్థానికుల్లోనూ విషాదంలో నింపింది.

ఓరుగల్లుతో ఉన్న అనుబంధం గొప్పది

- ప్రముఖ సాహితీవేత్త, ప్రసార భారతి రిటైర్డ్ అదనపు డీజీ రేవూరి అనంత పద్మనాభరావు



రేవూరి అనంత పద్మనాభరావుకు పురస్కారం ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

హన్మకొండ కల్చరల్ : సాహితీవేత్తలకు నిలయమైన ఓరుగల్లుతో తనకున్న అనుబంధం గొప్పదని, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నానని ప్రముఖ సాహితీవేత్త, ప్రసారభారతి రిటైర్డ్ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు అన్నారు. వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ప్రతి సంవత్సరం ద్విశతావధాని దివంగత డాక్టర్ రాళ్లబండి కవితాప్రసాద్ స్మారకంగా అందజేస్తున్న సహృదయానుబంధ పురస్కారాన్ని రేవూరి అనంత పద్మనాభరావుకు అందజేశారు. కవితాప్రసాద్ జయంతి సందర్భంగా మంగళవారం రాత్రి హనుమకొండలోని వడ్డేపల్లిరోడ్డు పీఆర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సహృదయ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజామనోహరబాబు అధ్యక్షతన జరిగిన సభలో న్యూఢిల్లీ ఐసీహెచ్‌ఆర్ మాజీ అధ్యక్షుడు ఆచార్య యెల్లాప్రగడ సుదర్శన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంత పద్మనాభరావు మాట్లాడుతూ కాళోజీ, పేర్వారం జగన్నాథరావు, కవితాప్రసాద్‌తో తనకు సత్సంబంధాలున్నాయన్నారు. కార్యక్రమంలో సహృదయ ప్రధాన కార్యదర్శి కుందావఝుల కృష్ణమూర్తి, ఏ.జయశంకర్, అక్కెర సదానందాచారి, మేకల కేదారి, వేదాంతం శ్రీదేవి, భాస్కర్, చక్రవర్తుల శ్రీనివాస్, సహృయసంస్థ కార్యవర్గ సభ్యుడు జులూరు నాగరాజు, కవులు, సాహితీవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై టెండర్లలో కుంభకోణం

- సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్లు పెద్ది, రవీందర్ సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

హన్మకొండ: సివిల్ సప్లై టెండర్లలో రూ.వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆ కార్పొరేషన్ మాజీ చైర్మన్లు పెద్ది సుదర్శన్ రెడ్డి, రవీందర్ సింగ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. తాము మూడు రోజుల నుంచి సివిల్ సప్లైలో జరిగిన కుంభకోణంపై ఆరోపిస్తున్నా, ప్రశ్నిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. దీంతో పెద్ద ఎత్తున కుంభకోణం జరిగినట్లు వాస్తవం ఒప్పుకున్నట్లేనన్నారు. తమ వద్ద అన్ని ఆధారాలున్నాయన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బ్లాక్ లిస్ట్‌లో పెట్టిన సంస్థకు టెండర్ అప్పగించారంటేనే ఇందులో ఏదో మతలబు ఉందని అర్థమవుతోందన్నారు. 2023 మార్చిలో ప్రభుత్వం రెండు సంవత్సరాల పాటు 'కేంద్రీయ' బండార్ అనే సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెటిందన్నారు. ఒక్క సారి బ్లాక్ లిస్ట్‌లో పెడితే ఎలాంటి టెండర్లలో పాల్గొనొద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ఇదే సంస్థకు రూ.8 వేల కోట్లకు టెండర్లు అప్పగించిందన్నారు. దీని వెనుక ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ పెద్దల పాత్ర ఉందన్నారు. దీనిపై ఈ నెల 23న సీఎస్, డీజీపీ, విజిలెన్స్ డీజీపీ, ఏసీబీ, సీబీఐ, ఈడీకి ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో జోరిక రమేష్, బొల్లికుండ వీరేందర్, మనోజ్, ప్రశాంత్, శరత్ చంద్ర పాల్గొన్నారు.

కేయూ ఎస్‌డీఎల్‌సీఈ మెయిన్‌గేట్ తాళం తొలగింపు



మెయిన్ గేట్ తాళం తొలగిస్తున్న మల్లేశ్వర్, ఇతర ఉద్యోగులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఎస్‌డీఎల్‌సీఈ మెయిన్‌గేట్, మరోగేట్ కూడా కొన్ని సంవత్సరాలుగా తాళాలు వేసి మూసివేసి ఉంటున్నాయి. ఈ క్రమంలో వీసీ తాటికొండ రమేశ్ పదవీకాలం ముగియడంతో దూరవిద్యాకేంద్రం పరిరక్షణ ఐక్య ఉద్యోగుల సంఘం చైర్మన్ సంగానిమల్లేశ్వర్.. ఇతర ఉద్యోగులతో కలిసి మెయిన్ గేట్ తాళం తొలగించారు. ఆయన మాట్లాడుతూ మాజీ డైరెక్టర్ ఇరువైపులా ఉన్న ద్వారాలు మూసివేయించి కర్కశంగా వ్యవహరించారన్నారు. గేట్లు మూసివేయడం వల్ల ఉద్యోగులు తమ వాహనాలు రోడ్డుపై నిలపాల్సి వస్తోందన్నారు. అంతేగాకుండా విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందన్నారు. వీసీ అండతో ఆ మాజీ డైరెక్టర్ ఉద్యోగుల పట్ల వివక్ష చూపారన్నారు. పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా రెండు గేట్లు మూసివేసి ఉంచారన్నారు. ఈ క్రమంలో మంగళవారం మెయిన్‌గేట్ తాళం బ్రేక్ చేశామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు డాక్టర్ నల్లాని శ్రీనివాస్, కొట్టేభాస్కర్, పాలెపాక ప్రతాప్, బండివెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, సుదయ్య, గౌస్‌పాషా పాల్గొన్నారు. కాగా, ఇక నుంచి రోజూ దూరవిద్య కేంద్రం మెయిన్‌గేట్ ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 6గంటల వరకు తెరిచి ఉంచుతామని డైరెక్టర్ ప్రొఫెసర్ వి రాంచందర్ తెలిపారు.